# వేదిక

కళకైనా కలలకైనా జీవితమే వేదిక

కోసూరి ఉమాభారతి



# " వేదిక "

## కళకైనా కలలకైనా జీవితమే వేదిక

(నవల)


## కోసూరి ఉమాభారతి



**62 వ ప్రచురణ**

**Vanguri Foundation of America, Inc,**

Houston, Texas



# వేదిక

**అ**ప్పుడే నిదుర లేచిన నాకు .... సన్నగా అమ్మ పాట వినబడుతుంది.

“...రామచిలుక నొకటి పెంచి ప్రేమ మాటలాడ నేర్పి... రామరామరామ యనుచు...”

అమ్మ పాడితే ఎంతో బాగుంటుంది. కళ్ళు తెరిచి వెల్లకిలా తిరిగి పడుకున్నాను. చక్కగా వినిపిస్తున్న అమ్మ గొంతుతో .... గొంతు కలిపి సన్నగా పాడ్డం మొదలుపెట్టాను.

అటుగా ఉన్న చిన్న హాల్లో, రోజూ సంగీతం క్లాస్ చెబుతుంది అమ్మ. పిల్లలకి, పెద్దవాళ్ళకి కూడా పాట నేర్పిస్తుంది. ఇప్పుడు వేసవి సెలవల్లో ప్రతిరోజూ శిష్యులు వస్తారు..

ఆ క్లాస్ అయ్యేంతవరకు నేను కథల పుస్తకం చదువుకొని, కాసేపు టీవీ చూసి, అమ్మ రూములోనే పడుకుంటాను.. ఉయ్యాలలో ఉన్న తమ్ముడు నిద్ర లేస్తే మాత్రం వాణ్ణి జోకొట్టమంది అమ్మ.

★ ★ ★

తమ్ముడు గుర్తొచ్చి, పక్కకు తిరిగి చూస్తే నిద్రపోతున్నాడు. బాబు నోట్లో పాల సీసా అలాగే ఉంది. మంచం పక్కనున్న బల్లపీట మీద కాళ్ళుంచి లేచి నిలబడ్డాను. ఓ సారి గుండ్రంగా తిరిగి, నేల మీదకి గెంతాను. మా ఇంట్లో లాంటి పందిరి మంచం మాకు తెలిసిన ఇంకెవరి ఇంట్లోనూ చూడలేదు. నేను దాన్ని ఎక్కాలన్నా, దిగాలన్నా బల్లపీట నుండే...ఇది అమ్మ మంచం.

చప్పుడు చేయకుండా తమ్ముడి దగ్గరగా వెళ్ళి, పాలసీసా పక్కకి తీసి వాడి నోరు తుడిచాను.

తమ్ముడి పేరు వినోద్. బాబు అని కూడా పిలుస్తాము..పోయిన ఆదివారం వాడి మొదటి పుట్టినరోజు చేసాము. నాకంటే ఐదేళ్ళు చిన్నవాడు....

బాబుని జోకొట్టి మెల్లగా వెనక్కి తిరిగాను.....

"....పలుకే బంగారమాయే ....." అమ్మ పాడుతుంది...

నా పాదాలు అమ్మ పాటకి అడుగులు వేస్తున్నాయి. అమ్మ వేస్తున్న తాళానికి ఓసారి వడిగా, ఓసారి నింపాదిగా...కదులుతున్నాయి. చేతులు తిప్పుతూ, గెంతుతూ, గదిలో చుట్టూ గుండ్రాలు తిరుగుతూ, అప్పుడప్పుడు అమ్మ బీరువా అద్దంలో చూసుకుంటూ డాన్స్ చేస్తున్నాను. నాలో అంతు తెలియని ఆనందం.

★ ★ ★

పాట ఆగిపోయింది. క్లాస్ అయిపోయిందన్నమాట.

"చంద్రా, ఇటూ రామ్మా" పిలిచింది అమ్మ.

ముఖం తుడుచుకుంటూ పరుగున వెళ్లాను.

మాలిని, చిట్టెమ్మ మామి, కమలక్కతో పాటే సంగీతం క్లాస్‌వాళ్ళంతా ఇంకా అక్కడే ఉన్నారు.

"మళ్ళీ డాన్స్ చేస్తున్నావా లోపల? ముఖమంతా చెమట పట్టేసింది, రొప్పుతున్నావు" దగ్గరికి తీసుకొని... చీర కొంగుతో నా ముఖం తుడిచింది అమ్మ.

"ఆ చేసే డాన్సుని మా ముందే చేయమనండి శారద గారు" అంటూ నా తల మీద మెల్లగా తట్టి వెళ్ళింది చిట్టెమ్మ మామి.

"మేడమ్, మీ క్రింద ఫ్లాట్‌లోనే, శివరామశర్మగారు కూచిపూడి డాన్స్ క్లాస్ మొదలు పెడతారంట. మా చెల్లెలు వెళ్ళబోతుంది. మన చంద్రకళని కూడా పంపండి మేడమ్" అంటూ నా బుగ్గ మీద ముద్దు పెట్టింది మాలిని..

"పాట నేర్చుకుంటుందిగా! ఎన్నని చేస్తుంది? కొత్త స్కూల్లో సెకెండ్ స్టాండర్డ్‌లో చేరబోతుంది కూడా" అనేసింది అమ్మ.

ఔను.. నా ఈడువాళ్ళతో పాట నేర్చుకుంటున్నాను. అంతేకాదు, అమ్మ నేర్పే పాటలన్నీ వింటూనే ఉంటాను... పాట ఇష్టమే... కాని ఆ పాటలకి డాన్స్ చేయడం ఇంకా ఇష్టం...

అమ్మ అన్నట్టే త్వరలో ఇంటి దగ్గరలో ఉన్న 'హోలీ ఏంజెల్స్' కాన్వెంటులో సెకెండ్ స్టాండర్డ్‌లో చేరబోతున్నాను కూడా. చదువు, హోంవర్క్ ఎక్కువుంటుందట మరి....

ఇంతలో లోపలి నుండి తమ్ముడి ఏడుపు వినిపించింది. నిద్ర లేచినట్టున్నాడు.

"చంద్రా, బాబు నిద్రలేచాడురా" అమ్మ నన్ను వొడి నుండి దింపి అటుగా వెళ్ళింది.

★ ★ ★

చీకటి పడుతుండగా, నాన్నవి ఆర్మీ టోపీ, ఆఫీస్ ఫైల్స్‌తో హడావిడిగా పైకి వచ్చాడు ఆర్డర్లీ కన్నన్. ఎప్పటిలాగానే, వరండాలో ఓ పక్కగా ఉన్న అలమారాలో వాటిని సర్దాడు. అలవాటుగా పరిగెడుతూనే ఉంటాడు కన్నన్...

ఆ వెనుకే నాన్న వచ్చారు. చేతిలో ఏదో ప్యాకెట్ ఉంది. "ఏమ్మా కళా" అని నన్ను పలకరించి వెళ్ళి తన కుర్చీలో కూర్చుని... బూట్లు విప్పారు.

నాన్న విప్పిన యూనిఫారం కోట్ కూడా అందుకొని అలమారాలో

సర్దేసి, నాన్నకు సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు కన్నన్. చేతిలోని ప్యాకెట్‌తోనే నాన్న లేచి లోనికెళ్ళారు.

ఆయన బట్టలు మార్చుకుని వచ్చేలోగా మైదానంలో క్రికెట్ ఆడుతున్న పిల్లల్ని చూస్తూ కూచున్నాను...

★ ★ ★

పొద్దున్నే ఆర్మీ సూట్ వేసుకుని, తలపై టోపీ పెట్టుకొని తయారవుతుంటే తలుపు దగ్గర నిలబడి నాన్నని చూస్తాను. జీపులో డ్యూటికి వెళుతూ నాకు 'టాటా' చెప్పేంత మటుకు రోజూ నాన్న వెంటే ఉంటాను.

నాన్న నాకు చాలా బలమున్న దేవుడిలా అనిపిస్తారు. మరి నాకు ఏది కావాలన్నా తెస్తారు. అమ్మకి, తమ్ముడికి కూడా.

నాన్నకి ఆదేష్ అనే జీపు డ్రైవర్ కూడా ఉన్నాడు. అతను బయట పనులు చేసి వెళ్ళిపోతాడు. కన్నన్ కింద అంతస్తులోని పనివాళ్ళ వసతిలో ఉంటాడు. ఆదివారం మాత్రమే అతనికి శెలవు అన్నది అమ్మ.

★ ★ ★

నాన్న వరండాలోకి వచ్చిన శబ్దమైతే అటుగా చూశాను.

ఆయన చేతిలో నాకిష్టమైన క్యాడ్‌బరీ చాక్లెట్ ఉంది. వచ్చి తన కుర్చీలో కూర్చున్నారు నాన్న. పరుగున వెళ్లి పక్కనే ఉన్న మోడా మీద చేరాను.

"ఏమ్మా కళా! ఇదిగో నీకు చాక్లెట్" అంటూ అందించారు.

"చెప్పు! ఇవాళ ఏం చేసావు? మ్యూజిక్ క్లాస్‌లో కూర్చునుంటావు, ఔనా?" అడిగారు.

"లేదు నాన్న. డాన్స్ చేసాను. అప్పుడు మనం ఆ సినిమాలో చూసిన డాన్స్, ప్రాక్టిస్ చేసాను. చేసి చూపిస్తా" అంటూ చాక్లెట్ టేబిల్ మీదుంచి, లేచి వరండాలోని కుర్చీలని పక్కకి జరిపాను.

"పిలిచినా రావటనా ....." అని పాడుతూ, అచ్చంగా సినిమాలో

అమ్మాయిలాగానే చేతులు తిప్పుతూ అడుగులు వేస్తుంటే, నాన్న నవ్వుతూ చప్పట్లు కొడుతున్నారు. బాబు నెత్తుకుని వరండాలోకి వచ్చిన అమ్మ కూడా నా డాన్స్ చూస్తూ నిలుచుంది.

మరింత సంతోషంగా అడుగులు వేస్తూ, నవ్వుతూ డాన్స్ చేస్తున్నాను... నాన్నకి కాఫీ కప్పందించి పక్కనే కూర్చుంది అమ్మ.

వొళ్ళంతా చెమటలు పడుతున్నా... అలా డాన్స్ చేస్తూనే ఉన్నాను.....

“ఇంక చాల్లే చంద్రా, మళ్ళీ రేపు వేరే పాటకి చేద్దువులే. ఇప్పుడు తమ్ముణ్ణి పార్క్‌కి తీసుకెళతావుగా” అన్నది అమ్మ నవ్వుతూ...

“శభాష్‌రా కళా, సినిమాలో అమ్మాయికంటే బాగా చేశావురా. ఒక్క నవ్వే కాదు. ముఖంలో కోపం, అలక, కూడా చూపించావు” నన్ను మెచ్చుకుంటూ బాబుని చేతుల్లోకి తీసుకున్నారు నాన్న. నాకు చాలా సంతోషంగా అనిపించింది.

‘పిలిచినా రావటనా’ కాదు. ‘పిలిచినా బిగువటరా’.. అదీ పాట” అన్నది అమ్మ మళ్ళీ నవ్వుతూ.

“అయినా మనం ఆ సినిమా చూసి రెండు వారాలయిందిగా. క్లబ్బులో ఈ ఆదివారం ఏ పాత సినిమా వేయనున్నారో..” అన్నది నాన్నని చూస్తూ.

“ఈ ఆదివారం కూచిపూడి ప్రోగ్రాం ఉందని చెప్పానుగా! మర్చిపోయావా?” అన్నారు నాన్న.

ఆర్మీ ఆంధ్ర క్లబ్బుకి నాన్న ప్రెసిడెంట్. ప్రతి ఆదివారం ఏదో ఒక ప్రోగ్రాం లేదా తెలుగు సినిమా ఏర్పాటు చేస్తారు నాన్నవాళ్ళు.

ఈసారి గుంటూరు నుంచి వస్తున్నారట ఆ కూచిపూడి బృందం.

ఇంతలో బట్టలు మార్చేసుకొని పైకి వచ్చాడు కన్నన్. బాబుని స్ట్రోలర్లో కూర్చోబెట్టుకుని రోజులా అతనితో పార్క్ కి బయలుదేరాను.

★ ★ ★

ఆదివారం పొద్దున్నే ఫోన్ మోగితే నాన్నే తీసారు.

"ఆ, ఆ, నమస్తే, వచ్చేసారా? ప్రయాణం బాగా జరిగిందిగా!. మా అసోషియేషన్‌వాళ్ళని కలిసే ఉంటారు. మీ ఏర్పాట్లన్నీ వాళ్ళు చూసుకుంటారు. కాస్త విశ్రాంతి తీసుకుని మీ పనులు మొదలు పెట్టుకోండి. నేను ప్రోగ్రాం టైంకి ముందే కలుస్తాను" అని ఫోన్ పెట్టేసారు.

కార్టూన్స్ చూస్తూ నాన్న మాటలు వింటున్న నాకు, క్లబ్బులో డాన్స్ ప్రోగ్రాం ఇవాళేనని అర్ధమయ్యింది.

★ ★ ★

లంచ్ అయ్యాక జుట్టు పైకి కట్టి, అమ్మ నాకు సిల్క్ గౌను వేయబోయింది. జడ వేసి పొడుగు బొట్టు, జుమ్కాలు పెట్టమన్నాను. పరికిణీ వేసి, కాళ్ళకి పాంజేబులు కూడా పెట్టమన్నాను.

"సరే, నువ్వు డాన్స్ చూడ్డానికి వెళుతున్నావా? లేక చెయ్యడానికా?" నవ్వుతూ నన్ను తయారు చేసింది అమ్మ.

★ ★ ★

ఆర్మీ-క్లబ్‌లో 'వేదిక' దగ్గర ఏర్పాట్లు చూడాలని పెందరాళే బయలుదేరాము. ఆదివారమే అయినా బాబు కోసం కన్నన్ మా కూడా వచ్చాడు. ప్రోగ్రాములంటే అతనికి ఇష్టమే...

ప్రోగ్రాం హాల్లో అమ్మ, బాబు ముందు వరసలో సోఫాల్లో కూర్చున్నారు. నేను మాత్రం నాన్న చేయి పట్టుకుని, స్టేజీ వెనుక మేకప్-రూముల వైపు వెళ్ళాను. వాటిని 'గ్రీన్-రూమ్' అంటారని అమ్మ చెప్పింది. మేకప్-రూమ్ అనవచ్చుగా అనుకున్నాను...

నాన్నని చూడగానే ఒకాయన పరుగున వచ్చి నమస్కరించాడు. మేకప్-రూమ్ వాకిలి వద్ద ఉన్న పెద్ద కుర్చీలో కూర్చున్నారు నాన్న.

"మీరూ కూర్చోండి మాస్టారూ" అన్నారు ఆయనతో, ఎదురుగా ఉన్న కుర్చీ చూపిస్తూ.

"అయ్యో మేజర్‌గారు! మిమ్మల్ని ఇలా స్వయంగా కలవడం

సంతోషంగా ఉంది సార్. తమరు గుంటూరులో మా స్కూలుకి వచ్చినప్పుడు కలవలేక పోయాను. క్షమించాలి” అన్నాడాయన కూర్చుంటూ.

“ఔను, పోయినేడు మేము గుంటూరు వచ్చినప్పుడు, మా అమ్మాయితో మీ ‘నాట్యాంజలి’ స్కూల్ కి వచ్చాను. ఆ సమయంలో మీరు బయట ఊరికి ప్రోగ్రాముకి వెళ్ళినట్టున్నారు. మీ అన్నగారితో మాట్లాడాను” అన్నారు నాన్న.

“ఔను సార్. అన్నయ్య మీ గురించి అంతా చెప్పాడు. ఈ పాప తమరి కుమార్తేగా! పాప గురించి కూడా చెప్పాడు” నా వంక చూస్తూ అడిగారు మాస్టారు.

“అవును, మా అమ్మాయి చంద్రకళ” అన్నారు నాన్న నా భుజాల చుట్టూ చేయి వేస్తూ. “డాన్స్ మీద చాలా ఆసక్తి. ఇప్పుడు ఏడేళ్ళు. ప్రస్తుతం వాళ్ళమ్మ దగ్గర సంగీతం నేర్చుకుంటుంది” మాస్టార్‌కి నా గురించి చెప్పారు నాన్న.

“చూడు కళా, ఈయన కూచిపూడి గురువు రాఘవేంద్రశర్మ. గుంటూరు నుంచి ఇక్కడ చెన్నైలో ప్రోగ్రాం ఇవ్వడానికి మనమే ఆహ్వానించాము. నమస్కారం చేయి” అన్నారు నాన్న నాతో. చేతులు జోడించి, నమస్కరించాను.

“పాప పేరుకు తగ్గట్టు కళకళలాడిపోతుంది. ఆసక్తి ఉంటే మంచి డాన్సర్ అవ్వచ్చు కూడా” అంటూ ఆశీర్వదించారు ఆయన.

నాన్న నాకోసం తన పక్కనే కుర్చీ వేయించారు. మాస్టర్ నుండి వాళ్ళు చేయబోయే ప్రోగ్రాము వివరాలు అడిగి తెలుసుకొన్నారు. కొంత రాసుకున్నారు కూడా.

★ ★ ★

మాటలయ్యాక, మాస్టారు తన డాన్స్ స్టూడెంట్స్ ని పిలిచారు. పదిమంది వరకు ఉన్నారు. డాన్స్ దుస్తుల్లో బాగున్నారు. ఒకబ్బాయి కృష్ణుడిలా తయారయ్యాడు.

"వీరు మేజర్ సత్యదేవ్‌గారు. కళాపోషకులే కాదు, కళాకారులు కూడా. వారి కాలేజీ రోజుల్లో సినిమాల్లో నటించి, అప్పట్లో కొన్నింటికి సహకార దర్శకత్వం కూడా వహించారు. ఇప్పుడు మాత్రం, మంచి స్థాయిలో ఉన్న ఆర్మీ ఆఫీసర్. ఇక్కడ చెన్నైలో ఆంధ్రసభ నిర్వాహకులు కూడా. మనలని ప్రత్యేకంగా ఆహ్వానించి ఈ ప్రోగ్రాం ఏర్పాటు చేసారు. ఈ అవకాశాన్నిచ్చి ఇంత చక్కని 'వేదిక' ని ఏర్పాటు చేసిన ఆయనకి నమస్కరించండి" అంటూ వాళ్ళకి నాన్న గురించి చెప్పారాయన.

అదంతా విన్నాక, 'నాన్న గురించి నాకు తెలియని గొప్పతనాలు ఇంకా ఉన్నాయన్న మాట' అనుకున్నాను. గర్వంగా అనిపించింది.

అందరూ నాన్నకి నమస్కరించారు. కొందరు వచ్చి నాన్న పాదాలు తాకి మరీ నమస్కరించారు.

"పోతే, ఈ బంగారపు బొమ్మ చంద్రకళ. వారి అమ్మాయి. వాళ్ళమ్మ సంగీత విద్వాంసురాలు. చంద్రకళ ఇప్పుడు సంగీతం నేర్చుకుంటుంది" అంటూ నా గురించి కూడా చెప్పాడాయన.

నాకు సిగ్గనిపించింది.

★ ★ ★

నాకు తెలిసిన వాళ్ళంతా వచ్చారు ప్రోగ్రాంకి. చిట్టెమ్మ మామి, భానుమామి, మాలిని. అమ్మ పక్కనే కూర్చున్నారు. అన్ని ప్రోగ్రాములకి అమ్మే వాళ్ళని ఆహ్వానిస్తుంది...

నన్ను చూస్తూ, "నువ్వు బాగున్నావే డాన్సర్‌లా, ఇవాళ నువ్వు కూడా ఓ డాన్స్ చెయ్యి" అన్నది భానుమామి.

నాకు ఒక్కసారిగా సంతోషమనిపించి, 'ఔనా' అనుకున్నాను. నాన్న తప్పక నాకు వేదిక మీద సమయం ఇవ్వగలరు కూడా.... అనిపించింది..

కొంచెమాగి, నిజంగానే అమ్మనడిగాను.

"నువ్వు ఏదైనా చిన్న పాట పాడు, నేను డాన్స్ చేస్తా" అని...

"వీలుపడదు మరోసారి చూద్దాం" అన్నది అమ్మ.

★ ★ ★

ప్రోగ్రాం మొదలయ్యింది. సినిమాల్లో తెర మీద డాన్స్ చూసే కంటే ఇలా దగ్గరి నుండి చూడ్డం బాగుంది...

ప్రోగ్రాం అంతా కళ్ళార్పకుండా చూసాను. చూసింది నాకు వచ్చేసినట్టే అనిపించింది.

డాన్స్ ప్రోగ్రాంలోని ప్రతినాట్యం ఒకదాని కంటే ఒకటి బాగనిపించింది.

ఇప్పటివరకు చూసిన వాటిల్లో తరంగం – నెమలి డాన్స్– దశావతారములు – ఎంకి డాన్స్ నచ్చాయి.

'గోవర్ధన గిరిధారి' పాటకి ఓ చిన్నమ్మాయి చేసిన డాన్స్ చాలా బాగుంది. ఆ పాట అమ్మ తరచు పాడుతుంది. వాళ్ళ డాన్స్ పాటలు – శ్లోకాలు కొన్ని అమ్మ పాడేవే. కొన్నింటిని గుర్తుపట్టాను.

'డాన్స్ చేసిన ఆ చిన్నమ్మాయిలాగా, నేనూ బాగా చెయ్యగలను' 'ఇకనుంచి మ్యూజిక్ క్లాస్‌లో అమ్మ ఈ పాట పాడేప్పుడు నేను డాన్స్ చేసేయ్యాల్సిందే' అనుకున్నాను.

ప్రోగ్రాం ముగిసాక, మంచి ప్రోగ్రాం ఏర్పాటు చేసారని అందరూ నాన్నని మెచ్చుకున్నారు.

★ ★ ★

ఇంటికొస్తుండగా తనకి ఆకలేస్తుందని గొడవ చేసాడు తమ్ముడు...

"ఇంటికి వెళ్ళగానే భోంచేస్తావుగా!" వాడిని బుజ్జగిస్తూ తన బాగ్ నుండి బిస్కెట్స్ తీసి నాక్కూడా ఇచ్చింది అమ్మ. బాబు గొడవే సరిపోయింది.. డాన్స్ గురించి అమ్మతో మాట్లాడలేకపోయాను..

★ ★ ★

భోజనం చేస్తూ మాత్రం, "వేదిక" అంటే ఏమిటి? వేదిక మీదే చెయ్యాలా డాన్స్?" అడిగాను అమ్మని.

"డాన్స్ ప్రదర్శనకి ఆచారబద్దంగా అంటే పద్దతిగా ఏర్పాటయిన ఎత్తైన పెద్ద స్థలం అన్నమాట. మామూలుగా 'స్టేజీ' అంటాము. నాట్యం చేసే వాళ్ళకి 'వేదిక' లేదా 'రంగస్థలం' అంటే దేవాలయమంత

పవిత్రం. అందుకే వేదికని చేతులతో అంటి కళ్ళకద్దుకొని ప్రదర్శన మొదలుపెడతారు” అన్నది అమ్మ.

నాకిష్టమైన కారెట్ కూర వడ్డిస్తూ, “మామీ అడిగింది కదాని, ఏదో ఒకలా అందరి ముందు డాన్స్ చేసేస్తానని అనకూడదు…తెలిసిందా? అన్నది అమ్మ నా తలపై చేయి వేసి…

“అలా ‘వేదిక’ల మీద నాట్యం చెయ్యాలంటే ముందు గురువు వద్ద నేర్చుకొని, ‘అభ్యాసన’ అంటే ప్రాక్టీసు చెయ్యాలి” అన్నది నవ్వుతూ…

‘ఔను కదా’ అనిపించింది. డాన్స్ గురించే ఆలోచిసూ్త నిదురపోయాను ఆ రాత్రి.

★ ★ ★

పొద్దున్నే బిగ్గరగా వినబడుతున్న అమ్మ మాటలకి మెలుకువొచ్చింది. పనిపిల్ల కామాక్షిని సూపర్ మార్కెట్‌కి పంపుతున్నట్టుంది.

కిచెన్ నుండి వస్తున్న ఘుమఘుమ వాసనలని బట్టి అమ్మ ఇవాళ ఫ్రెంచ్‌టోస్ట్ చేస్తుందని తెలుస్తుంది. ఫ్రెంచ్‌టోస్ట్‌తో… తప్పకుండా పాయసం కూడా చేస్తుంది. స్నానం చేసి త్వరగా బయటపడాలని… పడకనుండి లేచాను…

★ ★ ★

తయారయి దేవుడికి దణ్ణం పెట్టుకునేలోగానే, బాబుని తీసుకొని టిఫిన్ చేయడానికి రమ్మని పిలిచింది అమ్మ. టీవీ చూస్తున్న బాబుని పిలుచుకుని డైనింగ్ టేబిల్ వద్దకు వెళ్లి కూర్చున్నాను.

పాయసం కప్పు నా ముందుంచుతూ, “నీకు ఇవ్వాల్టి నుంచి ఓ చక్కని డాన్స్ నేర్పిస్తాను. నా చిన్నపుడు నేను చేసిన డాన్స్. మా అక్కయ్య నాకంటే బాగా చేసేది… మంచి పాట కూడా. సెలవలు కదా! నేర్చుకుని ప్రాక్టీస్ చేయి. సంగీతం క్లాస్ మొదలయ్యే ముందు, రోజూ ఓ అరగంట ప్రాక్టీసు చేద్దాము” అన్నది అమ్మ.

వెంటనే కుర్చీ దిగి, “లవ్ యు అమ్మ” అంటూ అమ్మ మెడ చుట్టూ చేతులు వేసాను..

★ ★ ★

**'అధరం మధురం వదనం మధురం**
**నయనం మధురం, హసితం మధురం**
**హృదయం మధురం, గమనం మధురం**
**మధురాధిపతే అఖిలం మధురం....'**

నాకిష్టమైన పాటే. అది అమ్మ పాడుతుండగా నేను విన్న పాటే. వినీ వినీ నాకు వచ్చేసింది కూడా! ఆ పాటకే అర్థాలు చెబుతూ డాన్స్ నేర్పడం మొదలుపెట్టింది అమ్మ.

....'శ్రీకృష్ణుని అందాలు, నడకలు, నవ్వులు ఎంతో మధురం' అంటూ మొదలవుతాయి ఆ పాటలోని అర్థాలు....

★ ★ ★

మరో మూడువారాలకి, "నీకు ఒక డాన్స్ వచ్చేసినట్టే. బాగుంది" అని అమ్మ అన్నాకే, "మరి మ్యూజిక్ క్లాస్‌లో అందరి ఎదుటా చెయ్యవచ్చా?" అని అడిగాను.

"బేషుగ్గా! రేపు క్లాస్ అయి, అందరూ వెళ్ళే ముందు చెయ్యి"..అన్నది అమ్మ...

★ ★ ★

మరునాడు మ్యూజిక్ క్లాస్ ఎప్పుడవుతుందా అని వేచి చూసాను... ఆర్మీ క్లబ్బు ప్రోగ్రాములో మునుపు డాన్స్ చేసిన చిన్నమ్మాయిని గుర్తు చేసుకున్నాను. నాలో ఉత్సాహం రెట్టింపయ్యింది.

ఆ ఉత్సాహంతో అమ్మ శిష్యుల ఎదుట డాన్స్ చేసాను...

అందరూ చప్పట్లు కొట్టి, మెచ్చుకున్నారు....

"నమ్మలేనంత బాగా చేసావు" అని నాకు, "అంతకంటే మీరు బాగా నేర్పారు మేడమ్" అని అమ్మకి చెప్పారు..

"చంద్ర ఈ డాన్స్ చేస్తుంటే అచ్చంగా చిన్నప్పటి మా అక్కయ్యలా అనిపించింది" అన్నది అమ్మ.

"మీ అక్కయ్య ఎక్కడ ఉంటారు మేడమ్?" అని అడిగిన కమలక్కతో,

"మా సుశీలక్క ఆస్ట్రేలియాలో ఉంటారు. వాళ్ళమ్మాయి కూడా అక్కడ భరతనాట్యం నేర్చుకొంటుంది. " జవాబిచ్చింది అమ్మ....

"ఈసారి మా 'చిన్మయ మిషన్' వారి కృష్ణాష్టమికి నువ్వు ఈ డాన్స్ చెయ్యాలి చంద్రా" అన్నది నా భుజం మీద తట్టి, భానుమామి.

"అక్కడ మంచి 'వేదిక' ఉంటే, అమ్మ 'సరే' అంటే చేస్తాను. ఫంక్షన్ ఎప్పుడు?" అడిగాను భానుమామీని.

అమ్మతో సహా అందరూ నవ్వారు. సరిగ్గానే అన్నానుగా అనుకున్నాను....

★ ★ ★

వేసవి సెలవలయ్యాక, నాన్న చేయి పట్టుకొని స్కూల్లో అడుగు పెట్టాను. "హోలీ ఏంజల్స్" కాన్వెంట్ చాలా పెద్దది. నాన్న ప్రిన్సిపాల్‌తో మాట్లాడి నన్ను సెకెండ్ స్టాండర్డ్‌లో చేర్పించారు... కొనవలసిన యూనిఫాం, పుస్తకాల లిస్ట్ తీసుకుని అక్కడినుండి కదిలాము...

★ ★ ★

స్కూలు మొదటిరోజు పదినిముషాలు ముందే బయలుదేరాము. నాన్న నన్ను లోపలి వరకు దిగపెడతానన్నారు.

స్కూల్ లోపల కిక్కిరిసినట్టు జనం. నాన్నవెంట నడుస్తుంటే అందరూ మావంకే చూస్తున్నారు. నాకు తెలుసు, మానాన్న ఆర్మీ యూనిఫాంలో ఉన్నందుకే అని. నాన్నతో నడవాలంటే చాలా గర్వంగా, భయం లేకుండా, గొప్పగా అనిపిస్తుంది.

★ ★ ★

స్కూల్లో ప్రతిరోజు జరిగే మ్యూజిక్ క్లాస్ చాలా నచ్చింది నాకు. ఆటల్లో ఈజీగా గెలవగలనని, మా టీచర్లని అచ్చంగా అనుకరించి చూపగలనని, కొత్తగా నా గురించి నేను తెలుసుకున్నాను.

మా మ్యూజిక్ టీచర్ పేరు మేరీమాథ్యూ. ఇతర దేశస్థురాలు. ఇంగ్లీష్ పాటలు కొత్త పద్దతిలో నేర్పుతుంది మాకు.

★ ★ ★

స్కూలు విషయాలు చెప్పమని నాన్న అడిగినప్పుడు గదిని 'వేదిక'గా

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Vedika**

* * *